పోలీసులూ.. కాస్కోండి!



- సవాల్ విసురుతున్న దొంగలు
- జిల్లాలో పెరుగుతున్న చోరీలు
- మారణాయుధాలతో దోపిడీలు
- బిక్కుబిక్కుమంటున్న ప్రజలు
- రాత్రి గస్తీలు అంతంతమాత్రమే
- సమావేశాలే తప్ప.. చర్యలు ఏవీ?



(శ్రీకాకుళం క్రైం)

జిల్లాలో వరుస చోరీలతో దొంగలు రెచ్చిపోతున్నారు. ఇళ్లు, దుకాణాలతోపాటు పోలీసు కార్యాలయాల సమీపంలోనూ దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. తుపాకులు, కత్తులు వంటి మారణాయుధాలు తీసుకెళ్లి.. చోరీలకు పాల్పడుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో ప్రత్యేకంగా రెండు బీట్ల బృందాలు.. ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు ఉన్నా దొంగతనాలు నియంత్రించడంతో పోలీసులు విఫలమవుతున్నారని ఆరోపిస్తున్నారు. విశాఖ జిల్లాలో సైతం వరుస దొంగతనాల నేపథ్యంలో అక్కడి పోలీసులు అంతర్రాష్ట్ర దొంగలు చొరబడ్డారని గుర్తించారు. దీనిపై కమిషనర్ ఆదేశాల మేరకు అప్రమత్తంగా ఉండాలంటూ విశాఖ పోలీసులు అక్కడి ప్రజలకు హెచ్చరికలు జారీచేశారు. శ్రీకాకుళం జిల్లాలో మాత్రం ఉన్నతాధికారులు సమావేశాలే తప్ప.. చోరీల నియంత్రణ చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రిగస్తీలు సైతం ఎక్కడా కానరావడం లేదని పలువురు పేర్కొంటున్నారు.



సరుబుజ్జిలిలో చోరీకి గురైన నగల దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)



కాశీబుగ్గలో కొత్తకోట రామ ఇంట్లో చెల్లాచెదురుగా ఉన్న బీరువాలోని సామగ్రి (ఫైల్)

గడిచిన మూడేళ్లలో ప్రాపర్టీ నేరాలను పరిశీలిస్తే..

2021లో 224, 2022లో 252, 2023లో 267 దొంగతనాలు కలిపి మొత్తంగా 747 ప్రాపర్టీ నేరాలు జరిగినట్లు పోలీసుల గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది గడిచిన రెండు నెలల్లో సుమారు 20కు పైగా దొంగతనాలు చోటుచేసుకున్నాయి. వీటిల్లో భారీ చోరీలు కూడా ఉండటం గమనార్హం. గతంలో జిల్లాలో నేరస్థులే చోరీలకు పాల్పడేవారు. ప్రస్తుతం అంతర్రాష్ట్ర దొంగలు సైతం జిల్లాలో చొరబడి చోరీలకు పాల్పడడం చర్చనీయాంశమవుతోంది.

ఇటీవల చోరీలు ఇవీ..

- గతేడాది డిసెంబరు 3న నరసన్నపేటలోని ఇందిరానగర్‌లో సూర్యఅపార్ట్‌మెంట్స్‌లోని ఐదో అంతస్థులో ఉన్న దంత వైద్యుడు గురుదేవ్ ఇంట్లో 40 తులాల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల నగదు చోరీకి గురైంది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ ముఠా నవంబరు 9 నుంచి డిసెంబరు 3 వరకు రెక్కీ చేసి మరీ ఈ చోరీకి పాల్పడినట్లు ఏఎస్పీ అప్పట్లో అనుమానం వ్యక్తం చేశారు.
- గతేడాది డిసెంబరులో ఎచ్చెర్ల మండలంలోని జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న తమ్మినాయుడు పేటలోని లలితా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో భారీ చోరీ జరిగింది. ఆలయం గ్రిల్స్ విరగ్గొట్టి అమ్మవారికి అలంకరించిన ఆరు కిలోల వెండి కిరీటం, ఐదు తులాల బంగారం, హుండీలో ఉన్న నగదు అపహరించుకుపోయారు. ఆలయంలో 16 సీసీ కెమెరాలున్నా.. మాస్కులు ధరించి దొంగతనానికి పాల్పడటం విశేషం.
- గత నెల 19న సరుబుజ్జిలిలోని ఓ నగల దుకాణంలో దొంగలు చొరబడి 44 కిలోల వెండి ఆభరణాలు, రూ.10 వేల నగదు అపహరించారు. అక్కడ సీసీ ఫుటేజీ పరిశీలిస్తే ఆగంతకులు చేతులకు గ్లౌజ్‌లు, ముఖానికి మాస్కులు పెట్టుకోవడమే కాక తుపాకులు వంటి మారణాయుధాలు కలిగి ఉండడం ప్రజలతోపాటు పోలీసులను విస్మయానికి గురిచేసింది.
- గత నెల 26న కాశీబుగ్గ సబ్ డివిజన్ కార్యాలయం వెనుక వీధిలో కొత్తకోట రామ ఇంట్లో పట్టపగలే తాళాలు పగులగొట్టి మరీ 15 తులా బంగారం, మూడు తులాల వెండి దొంగలు పట్టుకుపోయారు. పట్టపగలు.. అదీ పోలీసుల అడ్డాకొచ్చి మరీ ఇలా చోరీ చేశారంటే పోలీసుల గస్తీ ఏ పాటిదో అర్థమవుతోంది.
- గత నెల 26న అర్ధరాత్రి శ్రీకాకుళం డే అండ్ నైట్ కూడలిలో ఉన్న మహలక్ష్మీ మెడికల్ షాపులో.. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన దేవాన బుజ్జి చొరబడి రూ.83వేలు కాజేశాడు. సీసీ కెమెరాల ఆధారంగా రెండో పట్టణ పోలీసులు చోరీకి పాల్పడిన బుజ్జిని పట్టుకుని నగదు రికవరీ చేశారు.
- తాజాగా శనివారం శ్రీకాకుళంలోని ఓ వృద్ధురాలిని తాళ్లతో కట్టేసి 30 తులాల బంగారు ఆభరణాలను అపహరించారు. ఇలా జిల్లాలో రోజూ ఏదోఒక చోట దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా చోరీల నియంత్రణపై పోలీసులు మరింత దృష్టి సారించాలని జిల్లావాసులు కోరుతున్నారు. రాత్రిగస్తీతో పాటు ఇటీవల జైలు నుంచి విడుదలైన పాత నేరస్థులపై కూడా ఓ కన్నేస్తే మంచిదని అభిప్రాయపడుతున్నారు.

తాళ్లతో కట్టేసి.. నోట్లో గుడ్డలు కుక్కి..

- శ్రీకాకుళంలో పట్టపగలే దోపిడీ
- పెళ్లి పిలుపు పేరుతో చొరబాటు
- గొంతు కోస్తామని వృద్ధురాలికి బెదిరింపు
- 30 తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లిన దుండగులు

శ్రీకాకుళం క్రైం, మార్చి 2: నెలరోజులుగా ఆ ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారు. శనివారం ఆ ఇంట్లో వృద్ధురాలు ఒంటరిగా ఉందని గుర్తించారు. పెళ్లి పిలుపు పేరుతో ఆ ఇంట్లోకి ఇద్దరు ఆగంతుకులు చొరబడ్డారు. వృద్ధురాలిని మంచానికి కట్టేసి.. నోట్లో వస్త్రాన్ని కుక్కేశారు. ఆమె ఒంటిపై ఉన్న సుమారు 30 తులాల బంగారు ఆభరణాలను అపహరించారు. శ్రీకాకుళం నగరంలో శనివారం పట్టపగలే ఈ దోపిడీ జరగడం ప్రజల్లో అలజడి రేపుతోంది. ఈ ఘటనకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

శ్రీకాకుళం నగరం బొంతావారి వీధిలో.. బమ్మిడిపాటి జగదాంబ అనే 75 ఏళ్ల వృద్ధురాలు తన కొడుకు శ్రీనివాసరావుతో కలిసి నివసిస్తోంది. శ్రీనివాసరావు సాయిమెడికేర్‌లో పని చేస్తున్నాడు. శనివారం ఆయన విధులకు వెళ్లగా.. జగదాంబ ఒక్కరే ఇంట్లో ఉన్నారు. దీనిని గమనించిన ఇద్దరు ఆగంతకులు శనివారం ఉదయం 11.30 నుంచి 12 గంటల మధ్య ఆ ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో వంట చేస్తున్న వృద్ధురాలు మీరెవరు.. ఎందుకు వచ్చారని ప్రశ్నించగా.. పెళ్లికి పిలవడానికి వచ్చామంటూ గేట్లు తీసుకుని ఇంట్లోకి ప్రవేశించారు. వెంటనే ఒకరు ఆమె నోరునొక్కి పక్కగదిలో ఉన్న మంచానికి తాళ్లతో కట్టేశారు. మాట్లాడకుండా నోట్లో వస్త్రాలు కుక్కారు. ఆమె చేతికి ఉన్న 16 బంగారు గాజులు (20 తులాలు), నాలుగు పేటల గొలుసు(5 తులాలు), రెండుపేటల గొలుసు (3 తులాలు), తులమున్నర పగడం, గుండుతో కలిసి మొత్తంగా 30 తులాల ఆభరణాలను దొంగిలించారు. అరిస్తే కత్తితో గొంతు కోస్తామని బెదిరించి పరారయ్యారు.



వృద్ధురాలు జగదాంబ వద్ద వివరాలు సేకరిస్తున్న ఏఎస్పీ, డీఎస్పీ, సీఐ

కాపాడిన సుధీర్..

దొంగలు పరారైన కొద్దిసేపటి తర్వాత.. వృద్ధురాలు జగదాంబ పక్కింట్లో ఉంటున్న సుధీర్ స్కూల్‌లో తన పిల్లలకు క్యారేజ్ ఇచ్చేందుకు బయటకు వచ్చాడు. ఆ సమయంలో వృద్ధురాలు సుధీర్ అని కేకలు వేయడంతో.. ఇంటికెళ్లి చూడగా.. ఆమె మంచానికి కట్టేసి పడి ఉంది. పక్కింటికి చెందిన సరిత అనే మహిళను సుధీర్ పిలిచి.. ఆమె సాయంతో వృద్ధురాలికి కట్లువిప్పి విషయం తెలుసుకున్నారు. వెంటనే జగదాంబ కొడుకు శ్రీనివాస్‌తో పాటు ఒకటో పట్టణ పోలీసులకు సుధీర్ సమాచారం అందించారు. ఎస్ఐ బలివాడ గణేష్, సీఐ ఎల్.సన్యాసి నాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీం సహాయంతో వేలిముద్రలు సేకరించారు. ఏఎస్పీ ప్రేమ్‌కాజల్, డీఎస్పీ వై.శృతి కూడా సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. చుట్టుపక్కల సీసీ కెమెరాలను పరిశీలించి నిందితులను గుర్తించే పనిలో పడ్డారు. ఇంట్లోకి ప్రవేశించిన ఆగంతకులు టోపీ ధరించి ఉన్నట్టు గుర్తించారు.

పథకం ప్రకారమే...

జగదాంబ ఇంటిపై దొంగలు కొన్నిరోజులుగా రెక్కీ నిర్వహిస్తున్నారు. ఇంట్లో ఎవరుంటున్నారు.. ఏమి పని చేస్తున్నారు.. ఎక్కడికి వెళ్తున్నారనేది గమనిస్తూనే ఉన్నారు. నెలరోజుల కిందట కూడా దోపిడీకి యత్నించారు. మెడికల్ ఫీల్డ్‌లో పనిచేస్తున్న శ్రీనివాసరావు బయటకు వెళ్లగా.. ఇంటికి తాళం వేసుకుని లోపల జగదాంబ పనులు చేసుకుంటోంది. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి.. మందులు తెచ్చామని, తలుపు తీయాలని చెప్పి లోపలకు చొరబడేందుకు మూడుసార్లు ప్రయత్నించారని బాధితురాలు ఒకటో పట్టణ పోలీసులకు వివరించింది. జగదాంబ పక్క ఇంటికి సీసీ కెమెరాలు ఉన్నాయని దుండగలు గుర్తించారు. దీంతో గత నెల 13న వేకువజామున 3.51 గంటలకు కర్రకు పెయింట్ బ్రష్ కట్టి.. ఆ సీసీ కెమెరాలకు నల్లరంగు వేశారు. శనివారం కూడా జగదాంబ ఇంటిపక్కన ఉన్నవారు బయట కూర్చుంటుండగానే దొంగలు చొరబడడం కొసమెరుపు. ఇదిలా ఉండగా నరసన్నపేటలో కొన్నిరోజుల కిందట ఓ దంతవైద్యుడు ఇంట్లో జరిగిన చోరీలానే ఈ దోపిడీ కూడా ఉండడంతో.. ఇది అంతర్రాష్ట్ర ముఠా పనేనని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వరుస దొంగతనాలతో ప్రజలు బయటకు రావడానికే కాదు.. ఒంటరిగా ఇంట్లో ఉండడానికి కూడా భయపడే దుస్థితి నెలకొంది.

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

- బంగారు ఆభరణాలు, మోటారు సైకిల్, నాటు తుపాకీ స్వాధీనం

నరసన్నపేట, మార్చి 2: మహిళల మెడల్లో ఉన్న బంగారు గొలుసులు దొంగిలించిన ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం నరసన్నపేట పోలీసుస్టేషన్‌లో ఎస్పీ రాధిక వెల్లడించారు. 'వివిధ నేరాలతో సంబంధం ఉన్న ఒడిశా రాష్ట్రం బరంపురంలోని కృష్ణమ్మపేట వీధికి చెందిన శిబ శంకర్ మహంతి అలియాస్ శివమహంతి (43), లక్ష్మీనరసింగసాహివీధికి చెందిన సురేష్ పాడి అలియాస్ సరోజ్ పాడి(32)ని జమ్ము కూడలి ఫ్లై ఓవర్ వద్ద పట్టుకుని అరెస్టు చేశాం. గత నెల 23న నరసన్నపేటలో జామి వరలక్ష్మి మెడలోని బంగారం గొలుసు దొంగతనం కేసుకు సంబంధించి తనిఖీలు నిర్వహించగా వీరు పట్టుబడ్డారు. మోటారు సైకిళ్ల నెంబరు ప్లేట్లు మార్చి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు వారు అంగీకరించారు. 2015 నుంచి వివిధ కేసుల్లో వారిద్దరూ నేరస్థులుగా ఉన్నారు. మద్యానికి, జూదం, బెట్టింగులకు అలవాటు పడి అనేక నేరాలకు పాల్పడ్డారు. వారి నుంచి పావు తక్కువ 22 తులాలు బంగారు ఆభరణాలు, ఒక మోటారు సైకిలు, ఒక నాటు తుపాకీ, 2 చాకులు, బంగారం కరిగించే మెటీరియల్, తప్పుడు నెంబరు ప్లేట్లు స్వాధీనం చేసుకున్నామ'ని ఎస్పీ తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ ప్రేమ్‌కాజల్, టెక్కలి డిఎస్పీ బాలచంద్రారెడ్డి, సీఐ బి.ప్రసాదరావు, ఎస్ఐ అశోక్‌బాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జీఆర్ రాధిక

నేడు పల్స్‌పోలియో

శ్రీకాకుళం అర్బన్, మార్చి 2: జిల్లాలో ఆదివారం పల్స్‌పోలియో నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలో 1,232 కేంద్రాల్లో ఐదేళ్లలోపు 1,79,984 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారు. ఇందుకు సంబంధించి 78 సంచార టీంలు, 121 సూపర్‌వైజర్ బృందాలను సిద్ధం చేశారు. డీఎంహెచ్‌వో బి.మీనాక్షి ఆదేశాల మేరకు శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో పీవో వెంకటరమణ పల్స్‌పోలియో పత్రాలు అన్ని పీహెచ్‌సీలకు అందేలా చర్యలు చేపట్టారు. పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.





శ్రీకాకుళంలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

తొలిరోజు 577 మంది గైర్హాజరు

- ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం

గుజరాతీపేట, మార్చి 2: ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 83 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 18,221 మంది విద్యార్థులకుగానూ 17,648 మంది హాజరయ్యారు. తొలిరోజు పరీక్షకు 577 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 7.30 గంటలకే కొంతమంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. అలాగే జనరల్ స్టడీస్‌తోపాటు ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 1,196 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 1151 మంది హాజరయ్యారు. 45 మంది గైర్హాజరయ్యారు.



ఇచ్ఛాపురంలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న దివ్యాంగుడు

8న పలాసకు చంద్రబాబు రాక



- ప్రజాగళం సభకు టీడీపీ నేతల ఏర్పాట్లు

పలాస/అరసవల్లి, మార్చి 2: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఈ నెల 8న పలాస రానున్నారు. పలాస-కాశీబుగ్గ సమీపంలోని టీడీపీ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్న ప్రజాగళం కార్యక్రమంలో పాల్గొనున్నారు. 8న ఉదయం 10గంటలకు హెలీకాప్టర్‌లో పలాస చేరుకుంటారు. అనంతరం మధ్యాహ్నం ఒంటిగంట వరకు బహిరంగ సభలో ప్రసంగిస్తారు. గత నెల 26న శ్రీకాకుళంలో 'రా.. కదలిరా!' పేరిట నిర్వహించిన చంద్రబాబు సభ ఘన విజయం సాధించింది. అదే ఉత్సాహంతో పలాసలో సభను కూడా విజయవంతం చేసేందుకు టీడీపీ నేతలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, రాష్ట్ర నాయకులు యార్లగడ్డ వెంకన్న చౌదరి, రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు తదితరులు సభా మైదానాన్ని, హెలీప్యాడ్‌ను పరిశీలించారు. అనంతరం విలేకరులతో కూన రవికుమార్ మాట్లాడుతూ.. ప్రజాగళం సభలో మహిళల సమస్యలు- వారి అభివృద్ధి వంటి అంశాలపై చర్చిస్తారని తెలిపారు. శాసనం- మొగిలిపాడు గ్రామాల మధ్య ఉన్న పంట పొలాలను చదును చేసి సభ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో హెలీప్యాడ్‌ను పరిశీలించామని తెలిపారు. ఈ సభకు జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున మహిళలు, పార్టీశ్రేణులు, అభిమానులు తరలిరానున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో టంకాల రవిశంకర్‌గుప్తా, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, డొక్కరి శంకర్, సూరాడ మోహనరావు, జోగ మల్లి పాల్గొన్నారు.



చంద్రబాబు సభ కోసం మైదానాన్ని పరిశీలిస్తున్న రవికుమార్, శిరీష

ఏజెన్సీ ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్న భరోసా

టెక్కలి, మార్చి 2: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏజెన్సీ ప్రాంతాల్లో మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని, గ్రామాలు అభివృద్ధి చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. శనివారం నందిగాం మండలం దిమ్మిడిజోల, దీనబంధుపురం, కైజోల, నౌగాం, కర్లపూడి, కల్లాడ, పెద్దతామరాపల్లి తదితర కొండల ప్రాంతాల్లో టీడీపీ శ్రేణులతో కలిసి అచ్చెన్న పర్యటించారు. బాబు షూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ, సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి ఓటర్లు మద్దతు పలకాలని కోరారు. వైసీపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం దిమ్మిడిజోల పంచాయతీ రాంపురం గిరిజన గ్రామం నుంచి లక్ష్మీపురం కిరణ్, జన్ని కుమారస్వామితో పాటు పది గిరిజన కుటుంబాలు వైసీపీని వీడి అచ్చెన్న సమక్షంలో టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుల పినకాన అజయ్‌కుమార్, సర్పంచ్ సలాన కృష్ణారావు, మళ్ల బాలకృష్ణ, కొల్లి హరిబాబు, తిరుపతిరావు తదితరులు ఉన్నారు.



అచ్చెన్న సమక్షంలో టీడీపీలో చేరిన రాంపురం వాసులు



గుంతను తప్పించబోయి.. కాలువలో దిగిన లారీ

సరుబుజ్జిలి మండలం అలికాం-బత్తిలి ప్రధాన రహదారిలో గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం విజయనగరం నుంచి హిరమండలం వైపు వస్తున్న సిమెంట్ లారీ స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో రహదారిపై ఉన్న గుంతలు తప్పించబోయి పక్కన ఉన్న పంట కాలువలో దిగబడిపోయింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా లారీ బయటకు రాకపోవడంతో చివరికి జేసీబీతో తీశాడు. ఈ రహదారిలో భారీ గుంతల కారణంగా ఇసుకలారీలు, ఇతర భారీ వాహనాలు దిగబడిపోవడంతో పాటు ద్విచక్ర వాహనదారులు కూడా ప్రమాదాలకు గురై గాయాలపాలైన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. గుంతలను పూడ్చాలని ఎన్నిసార్లు అధికారుల వద్ద మొరపెట్టుకున్నా ఫలితం లేకపోతోందని పలువురు వాపోతున్నారు. - సరుబుజ్జిలి



కొండల ప్రాంతానికి బస్సు సౌకర్యం కల్పించాలి

● అచ్చెన్నకు విద్యార్థినుల వినతి



అచ్చెన్నాయుడుతో విద్యార్థినులు

టెక్కలి: నందిగాం మండలంలోని కొండల ప్రాంతానికి బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థినులు కోరారు. ఈ మేరకు శనివారం కొండల ప్రాంతంలో పర్యటించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కారును విద్యార్థినులు ఆపి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కొండల ప్రాంతంలో బస్సు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థినులు హర్షం వ్యక్తంచేశారు.

సుదర్శనరావు సేవలు మరువలేనివి

పలాసరూరల్: గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి బొడ్డేపల్లి సుదర్శనరావు సేవలు మరువలేనివని ఎంపీ డీవో మెట్ట వైకుంఠరావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం సుదర్శనరావు సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించారని, ఆయనలేని లోటు తీర్చలేనిదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు లండ శ్రీధర్, కార్యదర్శులు సద్గుణరాజు, సుధాకర్, మీనాకుమారి, ఆశ పాల్గొన్నారు.

బాల్యవివాహాల నియంత్రణకు పాటుపడాలి

పాతపట్నం: బాల్యవివాహాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్.వైకుంఠరావు అన్నారు. పాఠశాలలో బ్రైట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ, కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8, 9 తరగతుల విద్యార్థులకు బాలల హక్కులు, బాల్యవివాహాల వల్ల కలుగు అనర్థాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడిన వారిపై పోక్సో చట్ట పరిధిలో కేసులు నమోదుచేస్తారన్నారు. పాతపట్నం మండల కోఆర్డినేటర్ జి.జగన్నాథం మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం దెబ్బతింటుందని, దీనిపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలని కోరారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయుడు ఎన్టీ రామారావు, మహిళా పోలీస్ సంతోషి తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువలు పెంపొందించాలి

టెక్కలి: మానవతా విలువలను ప్రతి ఒక్కరూ పెంపొందిచాలని, సాహిత్యంలో వీటికి స్థానం కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ కొలవెన్ను మలయ వాసిని అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. మానవతా విలువలను పాటించడం ద్వారా ఉన్నత వ్యక్తిత్వం పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మోహన రావు, మూల తాతారావు, భౌతికశాస్త్ర రిటైర్డ్ ఆచార్యులు ఎ.విఠల్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామయ్య తండ్రి సంబరాలు



హిరమండలం: మండలంలోని కల్లట గ్రామంలో రామయ్య తండ్రి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. రెండేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ ఉత్సవాల్లో గ్రామస్థులంతా భక్తి శ్రద్ధలతో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఊరేగింపు భారీ స్థాయిలో నిర్వహించారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోండి

టెక్కలి: శైవక్షేత్రమైన రావివలస ఎండల మల్లికార్జునస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆదేశించారు. ఈ మేరకు శనివారం తన కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులతో ఉత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఈవో వాకచర్ల రాధాకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ సర్లాన సుధాకర్, సర్పంచ్ బాలకృష్ణ, పలువురు అర్చక సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వివేకా హత్యలో జగన్ పాత్రపై విచారణ చేపట్టాలి

● మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, మార్చి 2: మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో సీఎం జగన్ పాత్రపై విచారణ చేయించాలని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదేళ్లవుతున్నా ఈ కేసులో కదలికలు లేవన్నారు. సొంత బాబాయ్ హత్యకు గురైతే కనీస చర్యలు తీసుకోకపోవడం రాజకీయ లబ్ధికోసమేనని విమర్శించారు. వివేకా హత్యకేసులో పాత్రధారి, సూత్రధారి జగన్మోహనరెడ్డే అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ హత్యకేసుపై సీబీఐ విచారణ కోరిన జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. పూర్తి ఆధారాలతో ఎంపీ అవినాశ్‌ను అరెస్ట్ చేసేందుకు సీబీఐ వెళితే అధికారాన్ని అడ్డం పెట్టుకుని వైసీపీ క్యాడర్ గూండాయిజం చెలాయించారన్నారు. నిందితులను జగన్ వెనకేసుకు వస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజానీకం ఆలోచించి రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకునేందుకు చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీని బలపరచాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, రేణంకి కృష్ణంనాయుడు, బెవర రాము, భాస్కరరావు, చిట్టిబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలి

మెళియాపుట్టి: బాబు సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి కోరారు. శనివారం గొప్పిలి, జాడుపల్లి, మెళియాపుట్టి, మర్రిపాడు కస్టర్, బూత్, యూనిట్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క ఓటు కీలకంగా భావించి ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలన్నారు. నాయకులు భాస్కర్‌గౌడ్, లలిత కుమారి, వసంత్, గణపతిరావు, పైడిరాజ్, పరమేష్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణ

టీడీపీ పథకాలతోనే అభివృద్ధి



కొత్తడ్డపనసలో భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహిస్తున్న నేతలు

జలుమూరు (సారవకోట): టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో సంక్షేమం సాధ్యపడుతుందని, అలాగే టీడీపీతోనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకట రమణ అన్నారు. కొత్తడ్డపనస గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించడంతో పాటు టీడీపీ-జనసేన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోర ధర్మారావు, బోర సంతోష్‌కుమార్, చల్ల ఆనందరావు, పట్ట ఉమామహేశ్వరరావు, డి.జయరాం తదితరులు పాల్గొన్నారు. ● టీడీపీ అధినేత చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ ఐటీడీపీ ఇన్‌చార్జి సురవరపు తిరుపతిరావు అన్నారు. మాళువ పంచాయతీలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. అభివృద్ధిలో అధోగతి పాలైన రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మామిడి ఆనందరావు, సిరిపురం అప్పలనాయుడు, తాడేల భీమారావు తదితరులు పాల్గొన్నారు.

కల్పవృక్ష వాహనంపై వాసుదేవుడు

● నేత్రపర్వంగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు
● దేవనాథ రామానుజ జీయర్ అనుగ్రహభాషణం



వాసుదేవుని తిరువీధి ఉత్సవం



భక్తులకు తీర్థగోష్ఠి నిర్వహిస్తున్న స్వామీజీ

మందస, మార్చి 2: చారిత్రక, ఆధ్యాత్మిక ప్రసిద్ధి పొందిన మందస వాసుదేవుని ఆలయంలో బ్రహ్మోత్స వాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. శనివారం స్వామి కల్ప వృక్ష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమాల్లో భాగంగా ప్రాతఃకాలార్చన, నివేదన, విశేష హోమాలు, తీర్థ గోష్ఠి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామిని కల్పవృక్ష వాహనంపై వేంచేపు చేసి పండితుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ తిరువీధి నిర్వహించి ప్రధాన వేదిక పై ఆశీనులను చేయగా వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని పునీతులయ్యారు. ఈ సందర్భంగా దేవనాథ రామానుజ జీయర్ స్వామి భక్తులకు తీర్థగోష్ఠి నిర్వహించారు. భక్తులనుద్దేశించి మాట్లాడుతూ.. భక్తిభావం ముక్తికి మార్గమన్నారు. ప్రతి ఒక్కరూ భగవంతునిపై భక్తి కలిగి ఉండాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ఉన్న భక్తులకు స్వామి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. వాసుదేవుడు ప్రజల మంచిని కోరుకునే వాడని పేర్కొంటూ శ్రీకృష్ణుని లీలలను భక్తులకు వివరించారు. అలాగే పండి హరిశంకర్ బృందం సంగీత విభావరి, హరిప్రియ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.

నేటి కార్యక్రమాలు..

ఆదివారం ఉదయం భూ సమేత వాసుదేవుని కల్యాణం, వైశ్యరాజు రఘురామరాజు బృందం అన్నమయ్య సంకీర్తనలు, రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్య బృందం నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఘనంగా 'యువతరం' వార్షికోత్సవం

వజ్రపుకొత్తూరు: పూండిలోని యువతరం సేవా సమితి నాలుగో వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ లీలా కోదండరావు, డాక్టర్ మంత్రి వెంకటస్వామి, సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

ఉద్యోగాలకు డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎంపిక

పలాస: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు దక్కన్ కెమికల్స్ కంపెనీ, ఐసీఐసీఐ బ్యాంకు ఉద్యోగాలకు ఏడుగురు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తెలిపారు. ఈ ఎంపికలు శ్రీకాకుళం డిగ్రీ కళాశాలలో జరిగాయన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

పలాస: మునిసిపాలిటీలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని చైర్మన్ బళ్ల గిరిబాబు తెలిపారు. ఈ మేరకు కార్యాలయం వద్ద నీటి ట్యాంకర్లను శనివారం ప్రారంభించారు. అన్ని వార్డుల్లోనూ ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ముందుగా పూర్తిగా నీరులేని వార్డులకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మీసాల సురేష్‌బాబు పాల్గొన్నారు.

గుల్లలపాడులో జల్‌జీవన్ పథకం ప్రారంభం

వజ్రపుకొత్తూరు: చినవంక పంచాయతీ గుల్లలపాడు గ్రామంలో శనివారం జల్‌జీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన కొళాయిలను ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. అన్ని గ్రామాలకు తాగునీటిని అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో వేలిముద్రలు వేయించాలి

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందుతున్న లబ్ధిదారుల వేలిముద్రలు (థంబ్) మొబైల్ యాప్‌లో వేయించాలని ఎంపీడీవో జి.గిరిబాల సూచించారు. శనివారం తన కార్యాలయంలో సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని గ్రామ పంచాయతీల్లో వార్డు వలంటీర్లున్నారని, వారినుంచి లబ్ధిదారుల వివరాలు సేకరించి వేలిముద్రలు తీసుకోవడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ ఐ.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు: మంత్రి

పలాసరూరల్: ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఉప ఖజానా కార్యాలయ భవనాన్ని శనివారం ప్రారంభించారు. ప్రజలకు అన్ని సౌకర్యాలతో కార్యాలయాల నిర్మాణం చేపడుతున్నామని, వాటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్ రవికుమార్, ఆర్డీవో భరత్‌నాయక్, తహసీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు, ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు పాల్గొన్నారు.


ఓపీఎస్ పునరుద్ధరణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

● డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు

టెక్కలి: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఓపీఎస్‌పై యూటీఎఫ్ నాయకులు పాలవలస ధర్మారావు, కురమాన దాలయ్య, తమ్మినేని వైకుంఠరావు తదితరులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఎస్ వల్ల పదవీ విరమణ చేసిన ఉద్యోగుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఓపీఎస్‌ను అమలు చేస్తున్నాయని గుర్తుచేశారు. ఓపీఎస్ అమలును ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని సూచించారు. ఈ నేపథ్యంలో పరమేశ్వర రావు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్య పరిష్కరిస్తామని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఇప్పటికే హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ మాత్రమే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. ఉద్యోగ, కార్మిక సంఘాలు పెద్దఎత్తున ఇండియా కూటమికి మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో గణపతి, విజయ్‌కుమార్, దుర్గారావులు ఉన్నారు.



పరమేశ్వరరావుకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు



రైతు సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటరమణ

పలాస: జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. జీడి పంటకు మద్దతు ధర ప్రకటిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చినా నేటి వరకు అమలు చేయలేదన్నారు. జీడిపంట వచ్చే కాలంలో విదేశాల నుంచి దిగుమతి ఆపాలని, ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసి 80 కేజీల బస్తాకు రూ. 16 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇదే సమస్యపై మంత్రి అప్పల రాజుకు అనేక పర్యాయాలు విన్నవించినా సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేశారని ఆరోపించారు. గత ఆరేళ్లుగా నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు వంశధార నుంచి సాగు నీరందడం లేదని, దీంతో శివారు ప్రాంత రైతులు కాలువల నీరు రాక, వర్షాలు లేక కరువుబారిన పడ్డారన్నారు. ఉపాధి హామీ వేతనదారులకు రోజువారీ రూ.600 ఇవ్వాలని, 200 రోజులకు పని దినాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు చాపర వేణుగోపాల్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, సీహెచ్ రవి, గోరు వాసు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మామిడి మాధవరావు

జీడికి మద్దతు ధర ప్రకటించాలి

హరిపురం: ఉద్దానం జీవనాడి అయిన జీడిమామిడి పంటకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని చైతన్య రైతాంగ కమిటీ అధ్యక్షుడు మామిడి మాధవరావు కోరారు. హరిపురంలో శనివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీడి పిక్కల దశలో వ్యాపారులంతా సిండికేట్‌గా తయారై తక్కువ ధరలకు కొనుగోలు చేయడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. మరికొన్ని చోట్ల రైతులకు వ్యాపారులు అప్పులిచ్చి పిక్కలను కిస్తీకి కట్టుకోవడంతో ధరను వ్యాపారులే నిర్ణయిస్తుండడం దారుణమన్నారు. తితలీ నష్టపరిహారం అందని రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో హేమారావు చౌదరి, నల్లహడ్డీ, తాతారావు, బైరిశెట్టి గున్నయ్య, మజ్జి బాబూరావు, బెన్న కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మద్యంతో వైసీపీ నాయకుడి అరెస్టు

● రిమాండ్‌కు తరలింపు

హిరమండలం, మార్చి 2: ఎం.అవలంగి గ్రామానికి చెందిన మండల వైసీపీ యూత్ నాయకుడు చక్క బాలకృష్ణ అక్రమంగా మద్యం కలిగి ఉండడంతో ఎస్ఈబీ అధికారులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఎస్ఈబీ ఎస్ఐ శ్రావణి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అవలంగి గ్రామంలో దాడులు నిర్వహించగా బాలరాజు వద్ద 80 మద్యం సీసాలు దొరికాయన్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని బాలరాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఇటీవల అవలంగి గ్రామ సమీపంలో ప్రభుత్వం మద్యం దుకాణం ఏర్పాటు చేయగా పక్కనే అనుమతులు లేకుండా బాలకృష్ణ దాబా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గొట్టాబ్యారేజి సమీపంలో వంశధార నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తు పలుమార్లు పట్టుబడ్డాడు. పోలీస్ స్టేషన్‌లో అక్రమ ఇసుక తరలింపుపై కేసులు కూడా నమోదయ్యాయి.



పట్టుబడిన మద్యం సీసాలతో బాలరాజు



వైసీపీ ఫ్లెక్సీలో బాలరాజు(సర్కిల్‌లో)

ప్రణాళికతోనే మార్కులు పదిలం



- పాఠ్యాంశాలపై విద్యార్థులు పూర్తి అవగాహన పెంచుకోవాలి
- ఎలాంటి ఆందోళన వద్దంటున్న నిపుణులు
- ఈ నెల 18 నుంచి టెన్త్ పరీక్షలు

ఎచ్చెర్ల: విద్యార్థి దశలో తొలి పబ్లిక్ పరీక్షలు పదో తరగతిలోనే ప్రారంభమవుతాయి. విద్యార్థి భవిత కూడా ఈ పరీక్షలపైనే ఆధారపడి ఉంటుంది. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. గతంలో విద్యార్థులు ఆరు సబ్జెక్ట్‌ల్లో మొత్తం పదకొండు పేపర్లు రాసేవారు. ఈ ఏడాది మాత్రం సైన్స్ సబ్జెక్ట్‌లో రెండు పేపర్లు, మిగిలిన ఐదు సబ్జెక్ట్‌లు ఒక్కొక్క పేపరు వంతున మొత్తం ఏడు పేపర్లు రాయాలి. అయితే, ఎలాంటి ఆందోళనకు గురికాకుండా విద్యార్థులు ఓ ప్రణాళిక ప్రకారం చదివితే మంచి మార్కులు సాధించవచ్చని సబ్జెక్ట్ నిపుణులు చెబుతున్నారు.

వేకువ జామున చదివితే మరీ మంచిది

పరీక్షలు సమీపిస్తున్న కొద్దీ విద్యార్థులు రాత్రి పొద్దుపోయే వరకు మేల్కొని చదువుతుంటారు. ఇది ఎంతమాత్రం మంచిది కాదని విద్యావేత్తలు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థులు రాత్రి 10 గంటల లోపే నిద్రకు ఉపక్రమించాలి. వేకువ జామున కనీసం నాలుగు గంటలకు నిద్ర నుంచి మేల్కొని చదివితే మంచిది. తేలికపాటి ఆహారం తీసుకోవడం ఉత్తమం.

రెండు పేపర్లుగా సైన్స్

సైన్స్‌ను ఫిజికల్ సైన్స్, బయాలజీగా రెండుగా విభజించి రెండు రోజుల్లో పరీక్షలు నిర్వహిస్తారు. గతేడాది సైన్స్‌లో రెండు పేపర్లను ఒకే రోజు నిర్వహించడంతో విద్యార్థులు తికమకపడ్డారు. ఈ ఏడాది తొలి రోజు (మార్చి 23న) ఫిజికల్ సైన్స్ (మార్చి 26న) బయాలజీ పేపర్లను వేర్వేరుగా నిర్వహిస్తుండంతో విద్యార్థులు ఊపిరిపీల్చుకున్నారు.

డైలీ టెస్టలతో ప్రయోజనం..



శతశాతం మార్కులు స్కోర్ చేసే సబ్జెక్ట్ గణితం. సాధారణ విద్యార్థులు కూడా ఈ సబ్జెక్ట్‌లో మంచి మార్కులు తెచ్చుకోవచ్చు. విద్యార్థులకు ప్రతి రోజూ టెస్ట్‌లు నిర్వహిస్తున్నాం. ఈ టెస్ట్‌ల వల్ల విద్యార్థులు మరింత ప్రాక్టీస్ చేసేందుకు అవకాశం కలిగింది. ఒక మార్కు ప్రశ్నలతో విద్యార్థులు 12 మార్కులను స్కోరు చేసే వీలుంది. సంభావ్యతలో 15 మార్కులు, సంవర్గమానాలులో ఎనిమిది మార్కులు, సాంఖ్యాక శాస్త్రంలో 12 మార్కులు పొందే వీలుంది. గ్రాఫ్ పేపర్‌లో మూలాలు కనుగొనుట ద్వారా ఎనిమిది మార్కులు పొందవచ్చు. గణితంలో ఉండే చాప్టర్‌ల్లో ఏమైనా సందేహాలు ఉంటే విద్యార్థులు వాటిని నివృత్తి చేసుకోవాలి.

- బి.శ్రీనివాసరావు, గణితం స్కూల్ అసిస్టెంట్, జడ్పీ ఉన్నత పాఠశాల, డి.మత్స్యలేశం

అవగాహనతో మంచి మార్కులు



పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలి. తెలిసిన విషయాన్ని కూడా ఒకటికి రెండుసార్లు సరిచూసుకుని చదవాలి. ఇంగ్లిష్‌లో బయోగ్రాఫికల్ స్కెచ్‌లు రాసేటప్పుడు వరుస క్రమం పాటించాలి. పాఠ్యపుస్తకంలో ఉండే గ్రామర్‌కు 40 మార్కులు ఉంటుంది. కాంప్రెస్షిప్ (పాసేజ్‌లు)ను క్షుణ్ణం చదివి అర్థం చేసుకుంటే సమాధానాలు రాసే వీలుంది. అప్లికేషన్ మెథడ్‌లో ఉండే ప్రశ్నలను ఒకటికి రెండు సార్లు చదవాలి. లేదంటే తప్పులు రాసే అవకాశం ఉంది. క్రియేటివ్ రైటింగ్ (సృజనాత్మకత) రాసేటప్పుడు కాన్వర్షేషన్, లెటర్ రైటింగ్, ప్రశ్నల తయారీ (డబ్ల్యూహెచ్ క్వశ్చన్) సరిగా నింపితే మంచి మార్కులు వస్తాయి. ప్రశ్నాపత్రంలో ఇచ్చే చిత్రాలను బాగా పరిశీలించి.. అందుకు తగినట్టుగా సమాధానం రాయాలి. పాత ప్రశ్నా పత్రాలను, మోడల్ పేపర్లను ప్రిపేర్ కావడం వల్ల ప్రయోజనం ఉంటుంది.

-వి.చంద్రశేఖర్, ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్, జడ్పీ ఉన్నత పాఠశాల, అంపోలు

అర్థం చేసుకుని రాయాలి..



ప్రశ్నను ఒకటికి రెండుసార్లు చదివి అర్థం చేసుకుని సమాధానాలు రాయాలి. డేటా బేస్ ఆధారంగా వచ్చిన ప్రశ్నలను సరిగా పరిశీలిస్తే సమాధానాలు అందులోనే ఉంటాయి. పట్టికలను చక్కగా చదవడం వల్ల నాలుగు మార్కులు సులువుగా పొందవచ్చు. దయాగ్రమ్‌లను విద్యార్థులు కచ్చితంగా ప్రాక్టీస్ చేయాలి. ఎనిమిది మార్కుల ప్రశ్నలన్నీ ప్రయోగాలపై ఉంటాయి. ఫిజిక్స్ కెమిస్ట్రీలో చెరో ఆరు వంతున పాఠాలు ఉన్నాయి. ప్రమాణాలు రాసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

-ఎ.ఉమామహేశ్వరరావు, ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్, జడ్పీ ఉన్నత పాఠశాల, డి.మత్స్యలేశం

సెక్షన్ వారీగా జవాబులు రాస్తే మంచిది..



సోషల్ స్టడీస్‌లో ప్రధానంగా నాలుగు సెక్షన్లలో 33 ప్రశ్నలకు విద్యార్థులు సమాధానం రాయాలి. ఈ ప్రశ్నలకు సెక్షన్ల వారీగా సమాధానాలు రాయడానికి విద్యార్థులు ప్రయత్నిస్తే మంచి మార్కులు వచ్చే అవకాశం ఉంది. 1 నుంచి 12 వరకు ఒక మార్కులు ప్రశ్నలు, 13 నుంచి 20 వరకు రెండు మార్కుల ప్రశ్నలు, 21 నుంచి 28 వరకు నాలుగు మార్కుల ప్రశ్నలు, 29 నుంచి 33 వరకు 8 మార్కుల ప్రశ్నలు ఉంటాయి. భారతదేశం, ప్రపంచ పటాలపై మ్యాప్ పాయింట్లను గుర్తించి చెరో నాలుగు మార్కులను సులభంగా సాధించవచ్చు. బార్ గ్రాఫ్స్, పై డయాగ్రమ్స్, టైమ్‌లైన్ చార్ట్‌లను సరిగా అర్థం చేసుకుంటే మార్కులు సు లువుగా పొందవచ్చు. ప్రశ్నలను సరిగా చదివితే సమాధానం అందులోనే ఉంటుం దన్న విషయాన్ని గుర్తించాలి. భారతీయ భౌగోళిక స్వరూపాలు, శీతోష్ణస్థితి, గ్లోబలైజేషన్, సమతుల్య అభివృద్ధి చాప్టర్‌ల నుంచి ఎనిమిది మార్కుల ప్రశ్నలు వస్తుంటాయి.

-పి.రమేష్, పీజీటీ, సోషల్ స్టడీస్, ఎంజేపీ ఏపీబీసీడబ్ల్యూ గురుకుల పాఠశాల, అంపోలు

145 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ

జిల్లాలో 145 కేంద్రాల్లో రెగ్యులర్‌లో 28,982 మంది, ప్రైవేట్‌లో 1,592 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహణకు ఏడు ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌ను నియమించాం. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144వ సెక్షన్ అమలులో ఉంటుంది. మెరుగైన ఫలితాల సాధనకు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. రోజూ నిర్వహించే టెస్ట్‌ల ద్వారా విద్యార్థుల ప్రమాణాలను ఎప్పటికప్పుడు అంచనా వేసి.. వెనుకబడిన సబ్జెక్ట్‌లపై ప్రత్యేక దృష్టిసారించాలని ఉపాధ్యాయులను సూచిస్తున్నాం. ప్రశ్నాపత్రంపై అవగాహన కల్పించడంతో పాటు సమాధానాలు స్పష్టంగా రాసేలా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నాం.

- కె.వెంకటేశ్వరరావు, డీఈవో, శ్రీకాకుళం

పరీక్షలంటే భయమొద్దు..



పరీక్షలంటేనే భయపడాల్సిన అవసరం లేదు. ముందుగా నిర్ణయించుకున్న ప్లాన్ ప్రకారం చదివితే పరీక్షలపై భయమే ఉండదు. రాత్రి పొద్దుపోయే వరకు చదవడం సరికాదు. రాత్రి 10, 11 గంటలు దాటి చదవడం వల్ల ప్రయోజనం ఉండదు. ఉదయం నాలుగు గంటలకు నిద్ర నుంచి మేల్కొని చదివితే మంచిది. ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై శ్రద్ధ చూపాలి. తల్లిదండ్రులు సెల్‌ఫోన్లు, టీవీలను బంద్ చేసి పిల్లలను పక్కన కూర్చొబెట్టుకుని చదివించాలి. మానసిక సంసిద్ధతతోనే సత్ఫలితాలు సాధించగలం.

- డాక్టర్ జేఎల్ సంధ్యారాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ

6న మెగా జాబ్‌మేళా

అరసవల్లి: ఈ నెల 6వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటలకు రిమ్స్ ఆసుపత్రి జంక్షన్ దగ్గర డీఎల్‌టీసీ, ఐటీఐ వద్ద మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కె.సుధ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ కంపెనీల్లో ఉన్న 693 ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్స్, ఆధార్ కార్డులతో హాజరు కావాలని పేర్కొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

గుజరాతీపేట: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని స్వీప్ నోడల్ అధికారి, డీఆర్‌డీఏ పీడీ డీవీ విద్యాసాగర్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో శనివారం విభిన్న ప్రతిభావంతులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సదన్ న్యాయాధికారి సన్యాసినాయుడు మాట్లాడుతూ.. ఓటర్ హెల్ప్ లైన్, సివిజిల్ యాప్, యూఆర్‌ఎల్‌పై అవగాహన కల్పించారు. భారత ప్రభుత్వం అందిస్తున్న దివ్యాంగన్ కౌశల్ వికాస్, దివ్యాంగన్ రోజ్గార్ సేతు పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అడిషనల్ డైరెకర్ కె.కవిత, న్యాయవాది అన్నెపు భువనేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకం

శ్రీకాకుళం అర్బన్: నగరపాలక సంస్థలో అటెండర్‌గా పనిచేస్తున్న కొయ్యాన వెంకటరావు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ నేపథ్యంలో శనివారం అతడి భార్య దుర్గమ్మకు కారుణ్య నియామక పత్రాన్ని కమిషనర్ తమీమ్ అన్సారియా తన కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో ఇంజనీర్ పి.సుగునాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నేతాలమ్మ యాత్ర

జి.సిగడాం: వాండ్రంగిలో నేతాలమ్మ యాత్ర మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నట్లు అలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు వందలాది మంది భక్తులు తరలి వస్తారని, అందుకు అవసరమైన ఏర్పాటు పూర్తి చేసినట్టు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

టెట్‌కు 426 మంది హాజరు

ఎచ్చెర్ల: మండలంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్)కు శనివారం 426 మంది హాజరయ్యారు. శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో రెండు షిఫ్టుల్లో కలిపి 200కు 168 మంది, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో 280కు 258 మంది హాజరయ్యారు. రెండు కేంద్రాల్లో కలిపి 480కు 426 మంది హాజరుకాగా, 54 మంది గైర్హాజరయ్యారు. ఈ నెల 7వ తేదీ వరకు ఈ పరీక్షలు ఆన్‌లైన్‌లో జరగనున్నాయి.

ఇంటి స్థల పట్టాల పంపిణీ

ఇచ్ఛాపురం: పురపాలక సంఘ 16, 17వ వార్డుల పరిధిలో గల 80మంది లబ్ధిదారులకు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య జగనన్న పట్టాలు పంపిణీ చేశారు. శనివారం వార్డు పరిధిలో గల సచివాలయంలో పట్టాలు అందించి త్వరతగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. పట్టణ అధ్యక్షుడు బలివాడ ప్రకాష్ పట్నాయక్, 17వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి టెంక లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొందూరు: పొందూరు, లోలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ ఎస్ భయ్యన్నాయుడు, స్థానిక ఏఈ పి దుర్గాప్రసాద్ తెలిపారు. విద్యుత్‌సబ్ స్టేషన్‌ల పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు పొందూరు, రాపాక, కోటిపల్లి, వీఆర్ గూడెం, తండ్యాం, మలకాం, కొంచాడ, లోలుగు, దళ్లిపేట, బికంచరాం, నందివాడ, కేడీ పురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

పోలియో రహిత సమాజం నిర్మిద్దాం

సరుబుజ్జిలి: పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు సంతోష్ కుమార్, సాహితీ తెలిపారు. మండలంలో ఆదివారం నిర్వహించనున్నట్టు పల్స్ పోలియో కార్యక్రమంపై శనివారం ర్యాలీ నిర్వహించారు. 46 బృందాలు ద్వారా 92 మంది సిబ్బందితో మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ర్యాలీలో సీహెచ్‌వో మోహన్‌రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమానికి కృషి చేయాలి

సరుబుజ్జిలి: క్రైస్తవుల సంక్షేమానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని క్రిస్టియన్ రైటర్స్ ప్రొటెక్షన్ ఫోరం ఫౌండర్ ప్రెసిడెంట్ శమ్యూల్ అరుణ్ కుమార్ తెలిపారు. మండలంలోని కొత్తకోట పాస్టర్ డక్‌బాబు అధ్యక్షతన క్రైస్తవ సోదరుల సమావేశం శనివారం నిర్వహించారు. క్రైస్తవుల శ్మశాన వాటికలు, కమ్యూనిటీ హాల్స్, చర్చిల నిర్మాణాలు, ఇతరత్రా సంక్షేమ కార్యక్రమాలను గురించి చర్చించారు. అనంతరం ఉత్తమ సేవలకు ముఖ్యమంత్రి జగన్ నుంచి అవార్డు పొందిన అరుణ్‌కుమార్‌ను సన్మానించారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కవిటి: రాజపురంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 21వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఐదో తరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు.

స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యం

బూర్జ: స్వచ్ఛమైన గాలి ఎంత ముఖ్యమో నీరు అంతే అవసరమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. అల్లెన పంచాయతీ పరిధిలోని కిలంతర గ్రామంలో సుమారు రూ.1.13 కోట్లతో జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీటి కుళాయిలకు శనివారం ప్రారంభోత్సవం చేశారు. అనంతరం అల్లెన గ్రామంలో సుమారు రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, జగనన్న లే అవుట్లు నూతనంగా నిర్మించిన గృహాలను ప్రారంభించారు. కాగా కిలంతర గ్రామంలో డ్రైనేజీలు బాగోలేదని స్పీకర్‌ను ఆ గ్రామ మహిళలు నిలదీశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బెజ్జిపురం రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు, పీఏసీఎస్ అధ్యక్షులు బగాది నారాయణమూర్తి పాల్గొన్నారు.

రబీ ఈ క్రాప్ ముసాయిదా జాబితా

ఎచ్చెర్ల: సామాజిక తనిఖీల్లో భాగంగా రబీ 2023-24 సంబంధించి ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను అన్ని ఆర్బీకేల్లో ప్రదర్శించనున్నట్టు ఏవో వై.సురేష్ తెలిపారు. రబీ సాగు చేసిన రైతులు ఈ జాబితాలను పరిశీలించుకోవాలన్నారు. మార్పులు, చేర్పులకు ఈ నెల 5వ తేదీలోగా సంప్రదించాలన్నారు.

తమ్ముడిని చూసేందుకు వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



శివ(ఫైల్)

రణస్థలం/జి.సిగడాం: విశాఖలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న తన తమ్ముడిని చూసేందుకు వెళ్తూ రణస్థలం మండలం పైడిభీమవం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. జి.సిగడాం మండల కేంద్రానికి చెందిన పప్పు లక్ష్మణరావు, లక్ష్మికి ఇద్దరు కుమారులు. వీరిలో పెద్దవాడు శివ(18) తూర్పు గోదావరి జిల్లాలోని ఓ కళాశాలలో పాలిటెక్నిక్ పూర్తి చేసుకుని ఐదు రోజుల కిందటే గ్రామానికి వచ్చాడు. తన తమ్ముడు రమేష్ విశాఖలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు జరుగుతుండడంతో ఎలా రాస్తున్నాడో తెలుసుకునేందుకు వెళ్తున్నట్టు తల్లిదండ్రులకు చెప్పిన శివ.. తన స్నేహితులైన ఇదే మండలం జాడ గ్రామానికి చెందిన హేమంత్, చెట్టుపొదిలాం గ్రామానికి చెందిన భాస్కరరావుతో కలిసి ద్విచక్రవాహనంపై శనివారం బయలుదేరారు. ఈ క్రమంలో పైడిభీమవరం వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో శివ అక్కడికక్కడే మృతి చెందాడు. హేమంత్, భాస్కరరావు గాయపడడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాగా శివ తల్లిదండ్రులు జి.సిగడాంలో పాన్‌షాపు నడుపుకుంటూ పిల్లలను చదివిస్తున్నారు. ఈ ఘటనపై రణస్థలం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శివ మృతితో జి.సిగడాంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మూడు గడ్డి వాముల దగ్ధం

జి.సిగడాం: పెంట గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. పొగిరి తవిటినాయుడుకు చెందిన సుమారు మూడు ఎకరాలు గడ్డివాము, మక్క సత్యనారాయణకు చెందిన రెండు ఎకరాల గడ్డివాములు కాలి బూడిదయ్యాయి. విద్యుత్ షార్ట్ షర్క్యూట్‌తోనే ఈ ప్రమాదం జరిగినట్టు రైతులు తెలిపారు. గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు రాజాం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అస్తినష్టం సుమారు రూ.50 వేలు వరకు ఉంటుందని ప్రాథమిక అంచనా వేసినట్టు తెలిపారు.

బీజీ పుట్టుగలో రుద్రాభిషేకం



పూజల్లో పాల్గొన్న మహిళలు

కవిటి: బి.గొనప పుట్టుగ గ్రామంలో గౌరీశంకర ఆలయంలో శనివారం మహారుద్రాభిషేకాన్ని నిర్వహించారు. శివస్వాములు, గ్రామస్థుల సహకారంతో 500 మంది మహిళలు పూర్ణకలశాలు ప్రతిష్ఠించి పూజలు చేశారు. మహిళలు కుంకుమార్చనలు నిర్వహించి స్వామి వారికి అభిషేకాలు చేపట్టారు.

కలెక్టరేట్ నిర్మాణం పూర్తి చేయాలి

కలెక్టరేట్: సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న కలెక్టర్ కార్యాలయ భవన సముదాయాన్ని జేసీ ఎం.నవీన్, రహదారులు, భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఫిబ్రవరి 17వ తేదీ పర్యటనలో నాటి పనుల్లో పురోగతి, నిర్దేశించిన పనులపై ఆరా తీశారు. నాణ్యతలో రాజీ లేకుండా పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్వో ఎం.గణపతిరావు, ఆర్ అండ్ బీ ఏసీ సుధాకర్, ఈఈ రవి నాయక్, డీఈఈ ఎంఎల్‌వీ సాగర్, ఏఈఈ పీటీ రాజు, కాంట్రాక్టు ప్రతినిధి ప్రసాద్ ఉన్నారు.

పల్స్‌పోలియోపై అవగాహన

జి.సిగడాం: ప్రతీ చిన్నారికి పల్స్‌పోలియో చుక్కలు వేసేలా చర్యలు తీసుకోనున్నట్టు వైద్యాధికారులు బి.యశ్వంత్, పి.సుమబిందు, అనూష, శర్మ తెలిపారు. శనివారం జి.సిగడాం, బాతువ పీహెచ్‌సీ పరిధిలో పల్స్‌పోలియోపై అవగాహనా ర్యాలీని నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలో ఐదేళ్ల లోపు చిన్నారులు 2,348 మందిని గుర్తించినట్టు తెలిపారు. వీరికి పోలియో చుక్కలు వేసేందుకు రెండు రూట్లలో 14 బూత్‌లు ఒక మొబైల్ టీము ఏర్పాటు చేశామన్నారు. బాతువ పీహెచ్‌సీ పరిధిలో 2,056 మంది చిన్నారులను గుర్తించామని, రెండు రూట్లలో 19 బూత్‌లు, ఒక మొబైల్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్టు ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు తెలిపారు.

రుణాల లక్ష్యాలను శతశాతం చేరుకోవాలి

- బ్యాంకర్లతో సమీక్షలో కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద కేటాయించిన లక్ష్యాలను బ్యాంకర్లు శతశాతం చేరుకోవాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మంది రంలో శనివారం బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. లబ్ధిదారులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అర్హత కలిగిన వారికి విరివిగా రుణాలు మంజూరు చేయాలని, ఇందులో ఎటువంటి అలసత్వానికి తావు లేదని స్పష్టం చేశారు. జిల్లాల్లో ఈ ఆర్థిక సంవత్సంలో వ్యవసాయ సంబంధిత, ప్రాధాన్య, అప్రాధాన్య రంగాలు, ఎంపీఎంఈ కలుపు కుని 5,20,773 మందికి రూ.10,577 కోట్ల రుణాలు అందించి 102 శాతం ప్రగ తిని సాధించామన్నారు. లబ్ధిదారులకు రుణాల మంజూరుపై అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్యకిరణ్, రీజనల్ మేనేజర్ తిలక్, నాబార్డు ఏజీఎం వరప్రసాద్, డీఆర్డీఏ పీడీ విద్యాసాగర్, వ్యవసాయాధికారి శ్రీధర్, పశు సంవర్థక శాఖ జేడీ కిశోర్, డ్వామా పీడీ చిట్టిరాజు, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



అర్జునాపురంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కంచిలి: అర్జునాపురం గ్రామానికి చెందిన బుడ్డేపు గున్నయ్య అనారోగ్యంతో ఖతర్‌లో మృతి చెందగా, ఆ కుటుంబ సభ్యులను.. రేఖాదేవిపురం గ్రామానికి చెందిన భిమ్మో కార్జి కుటుంబ సభ్యులను ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా గున్నయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాదిన రామారావు, బుడ్డేపు కామేష్ రెడ్డి, కిషోర్ పాడి, మన్మథరావు, పైల రామారావు, శ్రీకాంత్ పరామర్శించార.

'డయల్ యువర్ వర్సిటీ'లో ఫిర్యాదులు



వివరాలు నమోదు చేసుకుంటున్న రిజిస్ట్రార్ అడ్డయ్య తదితరులు

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు, స్పెషల్ డ్రైవ్ పరీక్షల నిర్వహణ, పీజీ కోర్సుల ఒరిజినల్ సర్టిఫికేట్ల జారీలో జాప్యం తదితర అంశాలపై పలువురు విద్యార్థులు ఫోన్ ఇన్ లైవ్‌లో అడిగి తెలుసుకున్నారు. వర్సిటీ అనుబంధ కళాశాలల్లో కొన్ని యాజమాన్యాలు ఒరిజినల్ సర్టిఫికేట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని పలువురు విద్యార్థులు వర్సిటీ అధికారుల దృష్టికి తెచ్చారు. డిగ్రీ 4, 6 సెమిస్టర్లు, పీజీ నాలుగు సెమిస్టర్ పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారని పలువురు విద్యార్థులు ఆరా తీయగా, ఏప్రిల్ 3వ వారంలో వీటిని నిర్వహించే వీలుందని వర్సిటీ అధికారులు సమాధానం ఇచ్చారు. 2021 సంవత్సరం నుంచి వర్సిటీ ద్వారా పీజీ ఒరిజినల్ డిగ్రీలు అందడంలేదని పలువురు విద్యార్థులు తెలియజేయగా, డీజీ లాకర్‌లో అందుబాటులో ఉంచామని, పూర్తిస్థాయి ముద్రిత సర్టిఫికేట్లు జారీకి కొంత సమయం పడుతుందని వర్సిటీ అధికారులు వివరించారు. వర్సిటీ రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య, సైన్స్ ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి

ఇచ్ఛాపురం: ప్రతీ మహిళకు చట్టాలపై అవగాహన అవసరమని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి పి.పరీక్షకుమార్ అన్నారు. శనివారం ఐసీడీఎస్ కార్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ.. ఎటువంటి సమస్యలు ఎదురైనా ఎంఎల్ఎస్‌సీకి (మండల లీగల్ సర్వీస్‌సెస్ కమిటీ)ను ఆశ్రయిస్తే ఉచిత న్యాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో పి.నాగరాణి, రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.దేవరాజ్‌రెడ్డి, న్యాయవాదులు గిన్ని సీతయ్యరెడ్డి, ఎస్ఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిపై అప్రమత్తం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా న్యాయాధికారి అహ్మద్ మౌలానా

గుజరాతీపేట: కిడ్నీ వ్యాధిపై ప్రజలకు మరింత అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని జిల్లా న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. కిడ్నీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రాథమిక దశలోనే ఈ వ్యాధిని గుర్తించడం ఎలా అనే అంశంపై ముద్రించిన పోస్టర్లను శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు, ఆర్టీసీ పబ్లిక్ రిలేషన్స్ అధికారి సుమన్ పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి పాత్రపై విచారణ జరగాలి

అరసవల్లి: మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో జగన్‌రెడ్డి పాత్రపై విచారణ జరగాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసం వివేకాను జగన్‌రెడ్డి ముఠానే హతమార్చిందని ఆరోపించారు. సీబీఐ విచారణకు పిటీషన్ వేస్తానని సునీత అంటే జగన్ ఎందుకు ఆపారని, దీని వెనుక కారణం ప్రజలకు జగన్ వివరించాలని డిమాండ్ చేశారు. సునీతమ్మ చేస్తున్న న్యాయపోరాటానికి టీడీపీ అండగా ఉంటుందన్నారు. జగన్‌రెడ్డిని ఓడిస్తేగానీ రాష్ట్రంలో ప్రజల ధన, మాన ప్రాణాలకు రక్షణ ఉండదన్నారు.

హామీలు అమలు చేయమంటే అరెస్టు చేస్తారా?

అరసవల్లి: ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలుపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ చలో సీఎం క్యాంప్ కార్యాలయం కార్యక్రమానికి వెళ్తున్న విద్యార్థి, యువజ సంఘాల ప్రతినిదులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, జి.నర్సునాయుడు కార్యదర్శి హరీష్ అన్నారు. నగరంలోని స్థానిక క్రాంతి భవన్‌లో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తున్నారని, ప్రజాతంత్ర వాదులంతా ఈ అక్రమ అరెస్టులను ఖండించాలని, రాష్ట్ర పోలీసుల చర్యలను ఖండించాలని వారో కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.చందు, ఏఐవైఎఫ్ నరసన్నపేట నాయకుడు అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

తాడివలస బీఎల్‌వోపై విచారణ

పొందూరు: తాడివలస పంచాయతీలో 134వ బీఎల్‌వో, గ్రామ సచివాలయ మహిళా రక్షణాధికారి కూన ఉమమహేశ్వరిపై ఆ గ్రామ సర్పంచ్ తమ్మినేని మనెమ్మ ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం సచివాలయంలో ఈఆర్వో అప్పారావు, తహసీల్దార్ ఎం.పాల్‌కిరణ్ విచారణ చేపట్టారు. అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తుందని, గ్రామానికి చెందిన వ్యక్తి కావడమే కాకుండా రాజకీయ కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో ఎన్నికల ప్రక్రియలో పక్షపాతంగా వ్యవహరిస్తున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. 133వ బీఎల్‌వో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ మౌనిక రెండు ఎపిక్ నంబర్లపై 38 ఓట్లు తొలగించడం పైనా ఎన్నికల సంఘానికి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇప్పటికే అధికారులు విచారణ చేపట్టారు. వాస్తవానికి బీఎల్‌వో ఒక ఎపిక్‌నంబర్‌పై ఐదు ఓట్లు మాత్రమే తొలగించే అధికారం ఉన్నప్పటికి ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఒక ఎపిక్ నంబరుపై 21 ఓట్లు మరో ఎపిక్ నంబర్‌పై 17 ఓట్లు తొలగింపుపై ఫిర్యాదు చేశారు. 134వ బీఎల్‌వోపై గ్రామస్థులతో విచారణ చేపట్టారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు, ఎన్నికల సంఘానికి నివే దిస్తామని తహసీల్దార్ పాల్‌కిరణ్ తెలిపారు. ఈ విచారణలో సీఎస్‌డీటీ వెంకటేశ్వర రామానుజు పాల్గొన్నారు.

కలిసి పనిచేసి.. ప్రగతి సాధిద్దాం



మాట్లాడుతున్న చిన్నారావు

శ్రీకాకుళం అర్బన్: అధికారులతో కలిసి పనిచేసి పశు సంవర్థక శాఖ అభివృద్ధికి పాటు పడదామని గొర్రెల పెంపకందారులను సహకార సంఘ జిల్లా చైర్మన్ రాపాక చిన్నారావు పిలుపునిచ్చారు. జిల్లాలో గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం త్రీమ్యాన్ కమిటీ నూతనంగా నియమించడంతో చైర్మన్ చిన్నారావుతో పాటు సభ్యులను శనివారం జేడీ కార్యాలయంలో సన్మానించారు. అనంతరం ఏడీగా పదోన్నతి పొందిన యోగేశ్వరరావును కమిటీ సభ్యులతో పాటు ఆ శాఖ సిబ్బంది అభినందించారు.

ఆదిత్యుని దర్శించుకున్న ప్రముఖులు

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. విజయవాడ పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ ఎం.కృష్ణారెడ్డి దర్శించుకుని వారి బంధువులు నంద్యాల వాస్తవ్యులు బి.నారాయణరెడ్డి, నాగసుబ్బమ్మ దంపతుల తరపున రూ.లక్ష చెక్కును ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తికి అందజేశారు. అలాగే ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, సింహాచలం దేవస్థానం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు.